క్లుప్తంగా

'షీటీమ్స్' ఫోన్ నెంబర్లు

రాయదుర్గం: సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలోని మహిళలు షీటీమ్స్‌కు ఫిర్యాదు చేయాలా? ఎవరైనా ఆటపట్టిస్తున్నారా ? ఎవరైనా వెంబడిస్తున్నారా ? ఏదైనా ఇతర రకాలుగా వేధిస్తున్నారా ? ఫోన్ ద్వారా వేధిస్తున్నారా ? అయితే వెంటనే ఈ కింది నంబర్లకు వాట్సప్ ద్వారానైనా, ఫోన్ చేసి అయినా ఫిర్యాదు చేయవచ్చు.

- సైబరాబాద్ షీ టీమ్స్-9490617444
- బాలానగర్- 9490617 349
- ఐటీకారిడార్- 9490617352
- మాదాపూర్- 8333993519
- కూకట్‌పల్లి- 9493626811
- జగద్గిర్‌గుట్ట- 9493624561
- మియాపూర్- 9491051421
- పేట్ బషీరాబాద్- 7901114137
- శంషాబాద్- 9490617354
- డయల్- 100 కూడా చేయవచ్చు.

అయ్యప్పస్వామి మహాపాదయాత్ర పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబా

రాయదుర్గం: అందరి ఆరాధ్యదైవం అయ్యప్పస్వామి మహాపాదయాత్ర పోస్టర్‌ను గురువారం ఆవిష్కరించారు. దివ్యజ్యోతి ఆడియోస్, వీడియోస్ సంస్థ ఆధ్వర్యంలో నానక్‌రాంగూడలోని రంగనాథస్వామి ఆలయ ప్రాంగణంలో పోస్టర్‌ను గచ్చిబౌలి డివిజన్ మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబా చేతుల మీదుగా నిర్వాహకులు జి ముత్యంరెడ్డి, డి మాణిక్‌రెడ్డిల సమక్షంలో ఆవిష్కరించారు. అక్టోబర్ 26 నుంచి డిసెంబర్ 2వ తేదీ వరకు అయ్యప్పస్వామి మహాపాదయాత్ర కొనసాగుతుందన్నారు.

జనావాసాల్లో 'హైటెన్షన్'



శేరిలింగంపల్లి: ప్రమాదకరమైన హైటెన్షన్ విద్యుత్ వైర్లు జనావాసాల మీదుగా వేలాడుతున్నాయి. దీంతో గచ్చిబౌలి డివిజన్‌లోని నల్లగండ్ల హుడాకాలనీలోజనం భయాందోళనకు గురవుతున్నారు. రవీందర్‌రెడ్డి ఫంక్షన్ హాల్ నుంచి రాంకీ వెళ్లే రహదారిలో నిత్యం స్కూల్‌బస్సులు, వాహనాలు తిరుగుతూ ఉంటాయి. అక్కడ రోడ్డులో నుంచి హైటెన్షన్ విద్యుత్ వైర్లు కేవలం 12 అడుగుల ఎత్తులో ఉంటాయి. దీంతో వాహనదారులు ఎప్పుడు ఏ ఆపద ముంచుకొస్తుందోనని ఆందోళన చెందుతున్నారు. కాగా హైటెన్షన్ వైర్లను 20 అడుగుల ఎత్తులో మార్చాలని స్థానిక ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఈ సమస్యను పరిష్కరించాలని పలువురు స్థానికులు కోరుతున్నారు.

నేడు ఐఎస్‌బీలో గ్రాడ్యుయేషన్ వేడుక

రాయదుర్గం: ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ (ఐఎస్‌బీ)లో శుక్రవారం సాయంత్రం 4.30 గంటలకు గ్రాడ్యుయేషన్ వేడుకను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. గచ్చిబౌలిలోని ఐఎస్‌బీ క్యాంపస్‌లోని పీజీపీ కో23, పీజీపీ మ్యాక్స్‌కో22, ఎఫ్‌పీఎం, ఈఎఫ్‌పీఎం కోర్సుల విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ వేడుకను నిర్వహిస్తారు. ఈ కార్యక్రమంలో నైకా సంస్థ సీఈఓ, వ్యవస్థాపకుడు ఫల్గుణీనాయర్, ఐఎస్‌బీ ఎగ్జిక్యూటివ్ బోర్డు చైర్మన్ హరీష్‌మన్వానీ ముఖ్యఅతిథులుగా, ఐఎస్‌బీ డీన్ ప్రొఫెసర్ మదన్ పిల్లుట్ల పర్యవేక్షణలో ఈ కార్యక్రమం నిర్వహిస్తారు.

ఉచిత వైద్య శిబిరం

జిన్నారం(పటాన్‌చెరు): బేగంపేట ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో కానుకుంటలో ఎన్ఎస్ఎస్‌లో భాగంగా గురువారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యులు వెంకటేశ్వర్లు, ప్రసన్నలు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. వైస్ ఎంపీపీ మంజుల, ఉపసర్పంచ్ గోవర్ధన్‌రెడ్డి, వార్డు సభ్యులు వెంకటేశ్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ

జిన్నారం(పటాన్‌చెరు): గుమ్మడిదల మండల బీఆర్ఎస్ సమ్మేళనం ముగిసిన తరువాత తిరిగి వెళుతున్న కార్యకర్తల ఆటో బోల్తా పడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నవారిని గురువారం ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి పరామర్శించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

సందడిగా..రాములోరి కల్యాణం..

- వైభవంగా సీతారాముల కల్యాణమహోత్సవం
- శేరిలింగంపల్లి జంట సర్కిళ్ల పరిధిలో సందడి వాతావరణం



చందానగర్‌లో సీతారాముల కల్యాణం



గోపన్‌పల్లిలోని ఆంజనేయస్వామి ఆలయంలో ..



రాయదుర్గంలోని బీజేఆర్‌వై సంఘం భవనంలో..



శేరిలింగంపల్లి హుడాట్రేడ్ సెంటర్‌లో..



నల్లగండ్ల అపర్ణా గ్రాండే గేటెడ్ కమ్యూనిటీలో ..



హఫీజ్‌పేట్‌లో సీతారాముల కల్యాణోత్సవంలో ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ



నల్లగండ్ల హుడాకాలనీలో చేవెళ్ల ఎంపీ డాక్టర్ రంజిత్‌రెడ్డి

శేరిలింగంపల్లి జోన్ బృందం: శ్రీరామనవమి సందర్భంగా ఆలయాల్లో సీతారాముల కల్యాణమహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. భక్తుల జయజయధ్వానాలు, వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య సీతారాముల కల్యాణోత్సవం భక్తిశ్రద్ధలతో సాగింది. జై శ్రీరామ్....జైజై శ్రీరామ్ అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. గురువారం శ్రీరామనవమి వేడుకలలో భాగంగా సీతారాముల కల్యాణోత్సవాలు వాడవాడలా కన్నుల పండువగా సాగాయి. దీంతో కాలనీలు, బస్తీలు, ఆలయాల్లో సందడి వాతావరణం నెలకొంది. శేరిలింగంపల్లి జంట సర్కిళ్ల పరిధిలోని ఆలయాల ప్రాంగణం, కాలనీలు, బస్తీలు, గేటెడ్ కమ్యూనిటీలలో కూడా వైభవంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కాలనీలు, బస్తీలలోని ఆలయాలను రంగురంగుల పూలు, విద్యుత్ దీపాలు, మామిడిఆకులతో ప్రత్యేకంగా అలంకరించారు. కొండాపూర్, గచ్చిబౌలి, శేరిలింగంపల్లి, చందానగర్, మియాపూర్, హఫీజ్‌పేట్, మాదాపూర్ డివిజన్ల పరిధిలోని కాలనీలు, బస్తీలలో జరిగిన వేడుకల్లో ప్రజాప్రతినిధులు, నాయకులు, కాలనీ, బస్తీ వాసులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని సీతారాములను దర్శించుకున్నారు. అనంతరం ఆయా చోట్ల అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.



మియాపూర్‌లో..



ఇందిరానగర్‌లో..



టెలికామ్‌నగర్‌లోని సాయిదత్తగణపతి దేవాలయంలో ..

ఆకట్టుకున్న కూచిపూడి నృత్యప్రదర్శన



మాదాపూర్: కళాకారులు కూచిపూడి నృత్య ప్రదర్శనలతో సందర్శకులను అలరించారు. మాదాపూర్‌లోని శిల్పారామంలో గురువారం శ్రీరామనవమి సందర్భంగా డాక్టర్ ఓలేటి రంగమణి, ఓలేటి శ్రీరేఖ శిష్యబృందం కూచిపూడి నాట్యమహోత్సవాన్ని నిర్వహించారు. ఇందులో వినాయకస్తుతి, రామాయణశబ్దం, మండోదరి శపథం శబ్దం, తారంగం, సంధ్యతాండవం, రామదాసు కీర్తన, అన్నమయ్యకీర్తనలు, దశావతారాలు, మయూర కౌతం, మంగళం తదితర అంశాలను ప్రదర్శించి అలరించారు. కళాకారులు అక్షర ఓలేటి, రిషిత, లాస్య, ప్రియ, నవ్యశ్రీ, లౌక్య, ఇందు, గనిష్క, వివేకానందిని, శ్రీజ, జస్య తదితరులు ప్రదర్శన ఇచ్చారు.

నియోజకవర్గ అభివృద్ధికి నిరంతర కృషి



నాయకులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నామని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ అన్నారు. అభివృద్ధి పనులపై గురువారం ఆయన టోలిచౌకిలోని తన కార్యాలయంలో వివిధ డివిజన్ల నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నియోజకవర్గ పరిధిలో జరుగుతున్న వరదనీటి పైప్‌లైన్ పనులకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. పనుల్లో వేగం పెరిగేలా అధికారులకు సూచిస్తున్నామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ముఖ్యంగా రంజాన్ మాసంలో తరావీ ప్రార్థనలు జరుగుతున్న మసీదులు, కమ్యూనిటీ హాళ్ల వద్ద ప్రత్యేకంగా శానిటేషన్ పనులపై దృష్టి సారిస్తున్నానని ఆయన అన్నారు. మజ్లిస్ ఏరియా కమిటీ నాయకులు సైతం తమ తమ ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులు ఎప్పటికప్పుడు జరిగేలా చూడాలన్నారు. నాయకులు బదర్ ఉద్దీన్, హబీబ్ చావూస్, మజీద్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో భారీ చేరికలు

ఫిలింనగర్: ఖైరతాబాద్ నియోజక వర్గంలో కాంగ్రెస్ పార్టీ పట్ల ప్రజాదరణ రోజురోజుకూ పెరుగుతోందని, బడుగు, బలహీన వర్గాలకు పార్టీకి మద్దతుగా నిలబడేందుకు ముందుకు వస్తున్నారని ఖైరతాబాద్ కాంగ్రెస్ డీసీసీ అధ్యక్షుడు డాక్టర్ సి.రోహిణ్‌రెడ్డి అన్నారు. ఫిలింనగర్‌లోని అంబేడ్కర్ నగర్ బస్తీలో నిర్వహించిన హాథ్ సే హాథ్ జోడో అభియాన్‌లో భాగంగా ఆయన డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు కాటూరి రమేష్‌తో కలిసి పాదయాత్ర నిర్వహించారు. ఇందులో భాగంగా వివిధ పార్టీల నుంచి పెద్ద సంఖ్యలో కార్యకర్తలు కాంగ్రెస్‌పార్టీలో చేరగా వారికి పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. మహిళలు పెద్ద సంఖ్యలో విచ్చేసి తమ మద్దతును ప్రకటించారు.

అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొన్న కారు

- భార్యాభర్తలకు తీవ్ర గాయాలు
- చికిత్స కోసం ఆస్పత్రికి తరలింపు



గాయపడ్డ భార్యాభర్తలను 108 అంబులెన్స్‌లో తరలిస్తున్న దృశ్యం

పటాన్‌చెరుటౌన్: కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొన్న ఘటనలో భార్యాభర్తలకు తీవ్రగాయాలయ్యాయి. ఈ సంఘటన పటాన్‌చెరు మండలం రుద్రారం జాతీయ రహదారిపై జరిగింది. బాధితులు, స్థానికులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. రామచంద్రాపురం బీహెచ్ఈఎల్ ఉద్యోగి ప్రభాకర్, తన భార్య విజయలక్ష్మితో కలసి కారులో 65వ జాతీయ రహదారిపై సంగారెడ్డి వెళ్తున్నాడు. పటాన్‌చెరు మండలం రుద్రారం గ్రామ జాతీయ రహదారిపై కారు అదుపుతప్పడంతో డివైడర్‌ను ఢీ కొంది. దీంతో వారిద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. కారులో స్వల్పంగా మంటలు రావడంతో స్థానికులు అప్రమత్తమై వెంటనే ఆర్పివేశారు. గాయపడిన ఇద్దరిని బయటికితీసి బీహెచ్ఈఎల్ జనరల్ ఆస్పత్రికి 108 వాహనంలో తరలించారు. ఈ ఘటన జాతీయ రహదారిపై జరగడంతో కిలోమీటర్ మేర వాహనాలు నిలిచిపోయాయి.

మరణంలోనూ ప్రాణదాతగా..

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని అంబేడ్కర్ కాలనీకి చెందిన ఫొటోగ్రాఫర్ భరత్ ముదిరాజ్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన విషయం తెలిసిందే. కాగా మృతుడు భరత్ అవయవాలను వారి కుటుంబ సభ్యులు దానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. భరత్ సోదరి అనిత కిడ్నీ సమస్యతో మృతి చెందిందన్నారు. అటువంటి పరిస్థితి ఎవరికీ రాకూడదని అవయవ దానం చేసినట్లు తెలిపారు. కాలనీవాసులు వారిని అభినందించారు.

మైనర్ బాలిక అదృశ్యం

రాజేంద్రనగర్: ఇంటినుంచి బయటకు వెళ్లిన ఓ మైనర్ బాలిక కనిపించకుండా పోయింది. ఈ సంఘటన రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై ఖాజాపాషా తెలిపిన మేరకు.. కర్ణాటక రాష్ట్రానికి చెందిన ఓ కుటుంబం సంవత్సరం క్రితం కిస్మత్‌పూర్ సాయిబాబా కాలనీకి వలస వచ్చింది. వీరికి 17 సంవత్సరాల కూతురు ఉంది. కర్ణాటకలో ఉన్న సమయంలో స్థానికంగా ఉన్న ఓ యువకుడితో బాలిక చనువుగా ఉండేది. బుధవారం సాయంత్రం ఇంటి నుంచి బయటకు వెళ్లిన బాలిక తిరిగి రాలేదు. దీంతో తల్లిదండ్రులు స్థానిక ప్రాంతాలు, బంధువులు, స్నేహితుల ఇళ్లల్లో వెతికినా జాడ తెలియక పోవడంతో రాజేంద్రనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కర్ణాటకలోని బాలికతో చనువుగా ఉండే యువకుడు సైతం కనిపించడం లేదని అతడిపై అనుమానాలు ఉన్నాయని ఫిర్యాదులో పేర్కొన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రూ.30 కోట్ల విలువైన పార్కు కబ్జాకు యత్నం



శాస్త్రీపురం పార్కు ప్రహరీని కూల్చివేసిన దృశ్యం

రాజేంద్రనగర్: 30 కోట్ల విలువైన జీహెచ్ఎంసీ పార్కు స్థలాన్ని కొందరు ఆక్రమించేందుకు యత్నించారు. గురువారం ఉదయం ప్రహరీని కూల్చి చదును చేశారు. స్థానిక కాలనీ వాసులు అడుకొని పోలీసులకు, రెవెన్యూ, జీహెచ్ఎంసీ అధికారులకు ఫిర్యాదు చేయడంతో నిందితులు పారిపోయారు. పోలీసులు బీఎండబ్ల్యూ కారుతో పాటు రెండు జేసీబీలు, రెండు టిప్పర్లను స్వాధీనం చేసుకున్నారు. బీఎండబ్ల్యూ, బొలేరో వాహనంపై శివారుకు చెందిన ఎమ్మెల్యే సిక్కర్ ఉండడం గమనార్హం. శాస్త్రీపురం ప్రాంతంలో 1988లో హెచ్ఎండీఏ ద్వారా మొట్టమొదటి శాస్త్రీపురం సొసైటీ లేఅవుట్‌ను చేపట్టారు. ఈ లేఅవుట్‌లో 13 పార్కులను ఏర్పాటు చేసి జీహెచ్ఎంసీకి అప్పగించారు. కాలనీలోని చర్చి, ప్రార్థనా మందిరం ఎదురుగా 1.30 ఎకరాల స్థలంలో పార్కు స్థలం ఉంది. దీని చుట్టూ జీహెచ్ఎంసీ ప్రహరీని నిర్మించి మొక్కలను నాటి గార్డెన్‌ను నిర్వహిస్తోంది. దాదాపు 30 కోట్ల విలువైన ఈ స్థలాన్ని గురువారం ఉదయం కొందరు జేసీబీలు, టిప్పర్లతో వచ్చి చదును చేయడం ప్రారంభించారు. గంట వ్యవధిలో మొత్తం పార్కు ప్రహరీని కూల్చి చదును చేశారు. తెల్లవారుజామున 5 గంటలకే ఈ పనులు నిర్వహించడంతో స్థానికులు అడ్డుకొని మైలార్‌దేవ్‌పల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. సంఘటనా స్థలానికి పోలీసులు చేరుకోగానే నిందితులు పారిపోయారు. విషయాన్ని రాజేంద్రనగర్ జీహెచ్ఎంసీ, రెవెన్యూ అధికారులకు స్థానికులు ఫిర్యాదు చేశారు. మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో శాస్త్రీపురం సొసైటీ సభ్యులు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు.

పట్టించుకోని జీహెచ్ఎంసీ...

హెచ్ఎండీఏ ఆధ్వర్యంలో మొట్టమొదటి లే అవుట్ శాస్త్రీపురంలో 1988లో చేపట్టారు. దీంతో పాటు బుద్వేల్‌లో జనచైతన్య హౌసింగ్ సొసైటీ వెంచర్‌ను, మైలార్‌దేవ్‌పల్లిలో టీఎన్‌జీవోస్ హౌసింగ్ సొసైటీ చేపట్టింది. ఈ మూడు స్థలాల్లో దాదాపు 50 పార్కులను రిజిస్ట్రేషన్ చేసి జీహెచ్ఎంసీకి అప్పగించారు. రోజు రోజుకూ ఈ స్థలాల విలువ పెరుగుతుండడంతో కబ్జాదారులు వీటిని కబ్జాలు చేస్తున్నారు. ఇప్పటికే దాదాపు 20 పార్కులు కబ్జా అయినట్లు తెలుస్తోంది. పార్కుల నిర్వహణను జీహెచ్ఎంసీ పట్టించుకోకపోవడంతో విలువైన పార్కులు కబ్జాలకు గురవుతున్నాయి. కబ్జాదారులు భయభ్రాంతులకు గురి చేస్తుండడంతో స్థానికులు వెనుకడుగు వేస్తున్నారు. కబ్జాదారులు జీహెచ్ఎంసీ అధికారులతో ములాకత్ అయి కబ్జాలకు పాల్పడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

నెంబర్ ప్లేట్‌కు మాస్క్ వేస్తే చర్యలే..

మాదాపూర్ ట్రాఫిక్ సీఐ నర్సయ్య





మాదాపూర్: మాదాపూర్ ఐటీ జోన్ కావడంతో నిత్యం ట్రాఫిక్ సమస్య ఉత్పన్నమవుతోంది. ట్రాఫిక్ సమస్యను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ.. వాహనచోదకులకు అవగాహన కల్పిస్తున్నారు మాదాపూర్ ట్రాఫిక్ సీఐ నర్సయ్య. నెంబర్ ప్లేట్‌లో అక్షరాలు మాయం చేయడం, నెంబర్ ప్లేట్‌కు మాస్క్‌వేయడం లాంటివి చేస్తే చర్యలు తీసుకుంటామని పేర్కొంటున్నారు. ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి తీసుకుంటున్న చర్యలను ఆయన సాక్షికి వివరించారు.

◆ **ఉదయం 8 నుంచి 12 వరకు ట్రాఫిక్ సమస్య**

మాదాపూర్ ఐటీ జోన్ కావడంతో ట్రాఫిక్ సమస్య ఎక్కువగా ఉంటుంది. ఉదయం 8 నుండి మధ్యాహ్నం 12గంటల వరకు ట్రాఫిక్ సమస్య ఎక్కువగా ఉంటుంది. ప్రధానంగా మియాపూర్, జేఎన్‌టీయూ, కేపిహెచ్‌బీ ప్రాంతాల నుండి ఐటీ ఉద్యోగులు రావడంతో ఎన్ఐఏ, దుర్గంచెరువు, సైబర్‌టవర్స్, శిల్పారామం, సీఓడి ప్రాంతాలలో వాహన చోదకులు ఇబ్బందులు పడుతుంటారు.

◆ **నిబంధనలు పాటించకపోతే ఫైన్**

మాదాపూర్‌లోని ప్రధాన ప్రాంతాలలో ఖానామెట్, సైబర్‌టవర్స్, హైటెక్స్ తదితర ప్రాంతాలలో వాహనాల తనిఖీలను నిర్వహిస్తున్నాం. చాలా మంది వాహనాల నెంబర్‌ప్లేట్లకు మాస్క్‌లను తగిలించడం, వంకర చేయడం లాంటి పనులను చేస్తున్నారు. ఇందులో చదువుకున్న వారు సైతం ఉన్నారు. హెల్మెట్ లేకపోడం, నెంబర్‌ప్లేట్ కనిపించడకపోవడం, సరైన పత్రాలు లేకపోతే వారికి ఫైన్‌లను వేస్తున్నాము.

◆ **హెల్మెట్ తప్పనిసరి**

రోడ్డు ప్రమాదంలో ఎవరైనా మృతి చెందితే ఆ కుటుంబం ఆర్థికంగా ఇబ్బంది పడుతుంది. అంతేకాక ఆ వ్యక్తి లేకపోవడాన్ని కుటుంబసభ్యులు తట్టుకోలేరు. అందుకే హెల్మెట్ ఉంటే చాలా వరకు ప్రాణాలను కాపాడుకోవచ్చు. ప్రతి ఒక్కరూ హెల్మెట్‌లను ధరించి ట్రాఫిక్ రూల్స్‌ను పాటించాలి. నిబంధనలు పాటించని వారికి అవగాహన కూడా కల్పిస్తున్నాం.

◆ **ట్రాఫిక్ రూల్స్‌ను అధిగమించకుండా స్పీడ్‌గన్స్ ఏర్పాటు**

మాదాపూర్‌లోని పలు ప్రాంతాలలో స్పీడ్‌గన్స్‌ను వాడుతున్నాము. అధిక వేగంగా వస్తే అప్పటికప్పుడు ఫైన్‌లను వేస్తున్నాము. అధిక స్పీడ్‌తో వెళితే ఫైన్‌లు తప్పవు.

◆ **వాహనదారులకు మీరిచ్చే సలహా**

ఇంటి నుంచి బయటికి వచ్చేటప్పుడు ఇంధనం సరిపడా ఉందా లేదా అని చూసుకోవాలి. వాహనాల కండిషన్‌ను చూసుకోవాలి. ట్రాఫిక్ మధ్యలో బ్రేక్‌డౌన్ అయితే మిగిలిన వారికి సమస్య ఉంటుంది. వాహనదారులు సర్వీస్‌రోడ్లను ఎక్కువగా వాడుకోవాలి. ట్రాఫిక్ సమస్యలను తగ్గించాలంటే ట్రాఫిక్ రూల్స్‌ను ఖచ్చితంగా పాటించాలి. రాంగ్‌రూట్‌లలో వాహనాలను నడపరాదు. ఇది ట్రాఫిక్ సమస్యలకు దారితీయడమే కాకుండా ప్రమాదకరం కూడా.